క్లుప్తంగా

'మంత్రి కేశవ్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి'

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ హెచ్చరించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కేటీఆర్, హరీశ్‌రావును విమర్శించే అర్హత ఆయనకు లేదన్నారు. ముద్దం అనిల్‌గౌడ్, వడ్లూరి సాయి, కిరణ్, కోడం వెంకటేశం, ఎండీ అజ్జు, గాజుల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న బుర్ర శేఖర్‌గౌడ్

వేములవాడఅర్బన్: మధ్యమానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయాలని బీజేపీ వేములవాడ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లు గడిచినా హామీలు అమలుచేయడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున మళ్లీ నిర్వాసితులు దరఖాస్తులు చేసుకోవాలని చెబుతున్నారన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించిన తర్వాతే ముంపు గ్రామాల నిర్వాసితులను ఓట్లు అడగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రం మహేశ్, రాజిరెడ్డి, లక్ష్మణ్, శంకర్, పర్శరాములు, శ్రీనివాస్, మహేశ్, తదితరులు ఉన్నారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

కోనరావుపేట: మరిమడ్లలో కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ శుక్ర వారం పర్యటించనున్నారని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ తెలి పారు. మరిమడ్లలోని ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించి నూతనంగా నిర్మించే హాస్టల్ భవనం, సిబ్బంది వసతి గృహాల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తారన్నారు.

భక్తుల మనోభావాలు కాపాడాలి

సిరిసిల్లటౌన్: వేములవాడలో రాజన్న భక్తుల మనోభావాలు ప్రభుత్వం కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తుడు మారవేని రంజిత్‌కుమార్ కోరారు. ఈమేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖలు రాశారు.ఆలయంలో దర్గా ఉండటం మంగళకరం కాదని, మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉందని వెంటనే దానిని తొలగించాలని కోరారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం వట్టెంల జీపీ ఆవరణలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. నిర్వహించారు. వట్టెంల సబ్ సెంటర్ పరిధిలోని ఫాజుల్ నగర్, తుర్కాశి నగర్ గ్రామాల నుంచి 72 మందిని పరీక్షించి వారిలో తొమ్మిది మందికి తెమడ, 16 మందిని ఎక్స్‌రే కోసం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఆరోగ్య పర్యవేక్షకుడు గంగమ రాజు తెలిపారు. సెక్టార్ సూపర్‌వైజర్ రాజయ్య, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రసూన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలోజిపల్లికి బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్

వేములవాడ: నీలోజిపల్లికి రూ. 32 లక్షలతో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటుకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఇచ్చినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కూస రవీందర్ గురువారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ యూనిట్‌తో గ్రామంలోని రైతు కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

వేములవాడ: మధ్యమానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన కొదురుపాకలో పలువురు నిర్వాసితులు గురువారం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన గతంలోని పలు దరఖాస్తులను చదివి వినిపించారు. విచారణ చేపట్టి ఆరుగురిని గుర్తించామన్నారు. ఆయన వెంట సిబ్బంది మనోజ్, నిర్వాసితులున్నారు.

సామాన్యులకు చేరువలో రేషన్‌కార్డులు

ఎల్లారెడ్డిపేట: రేషన్‌కార్డులు సామాన్యులకు అందుబాటులోకి రావడంతో ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతుందని గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య తెలిపారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డులు రాక పేదలు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారన్నారు. వివాహమైనా భార్య పేరు రేషన్‌కార్డులోకి రాక చాలా మంది ఇబ్బంది పడ్డారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 14 నుంచి రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

ఉగ్గపట్టుడే !

- మండలకేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో అందుబాటులో పబ్లిక్ టాయిలెట్స్, సులభ్ కాంప్లెక్స్‌లు లేక ప్రయాణికులు, గ్రామీణులు ఇబ్బంది పడుతున్నారు. మండలకేంద్రంతో పాటు వెంకటాపూర్‌లో ఇదే పరిస్థితి ఉంది. వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు మూత్రశాలలు లేక ఉగ్గపట్టే పరిస్థితులు ఉన్నాయి. అత్యవసరమైతే మండలకేంద్రంలోని గిద్ద చెరువు కట్ట, లేదంటే దుమాల శివారు చిట్టివాగు వద్దకు వెళ్తున్నారు. ఎల్లారెడ్డిపేట జనాభా సుమారు 13 వేలు కాగా మండలకేంద్రానికి చుట్టూ సుమారు 15 గ్రామాలతో పాటు వీర్నపల్లి మండలం నుంచి నిత్యం వేలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కాగా అందుబాటులో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇక్కట్లు పడుతున్నారు. వెంకటాపూర్ జనాభా 5,041 కాగా, అక్కడే ఎక్కువగా వ్యాపారాలావాదేవీలు జరుగుతున్నాయి. సమీప గ్రామాలైన పోతిరెడ్డిపల్లి, అగ్రహారం, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం, కొండాపూర్, రామ్‌రెడ్డిపల్లె తదితర గ్రామాల నుంచి రోజూ వెయ్యిమంది వరకు ఆయా పనుల కోసం వస్తుంటారు. ఇలా ఈ రెండు గ్రామాల మేజర్ పంచాయతీలు అయినప్పటికీ పబ్లిక్ టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నారు.

నిధులున్నా పనులు సున్నా..

నిధులున్నా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో మాడ్రన్ టాయిలెట్స్ ఏర్పాటుకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. అందుకనుగుణంగా గ్రామ పంచాయతీ నుంచి నిధులు కేటాయించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. అయితే పంచాయతీరాజ్ శాఖ అధికారుల నుంచి డిజైనింగ్‌తో పాటు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో పనులు చేపట్టడం లేదు. గతంలో రాచర్ల గొల్లపల్లిలో రూ.8 లక్షలతో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అదే తరహాలో ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.

నిత్యం మండలకేంద్రానికి

మండలంలోని పలు గ్రామాల నుంచి నిత్యం వ్యక్తిగత పనులు, వ్యాపారాల కోసం సుమారు పదివేల వరకు ప్రజలు వస్తుంటారు. కాగా గ్రామ పంచాయతీల పరిధిలో రాచర్ల గొల్లపల్లి, ముస్తాబాద్‌లో తప్ప ఎక్కడ కూడా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించలేదు. వివిధ పనులు, వ్యాపారాల రీత్యా మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామ పంచాయతీల పరిధిలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గంటల తరబడి దుకాణంలో ఉంటూ మూత్రశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. ప్రజలు, వ్యాపారులకు అందుబాటులో పబ్లిక్ టాయిలెట్స్, సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించి ఇబ్బంది తొలగించాలి.
– ఐత దేవేందర్, వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

పనులు చేపడుతాం



డీఆర్డీఏ నుంచి వచ్చిన నిధులతో పాత బస్టాండ్‌లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మిస్తాం. స్థలాన్ని పరిశీలించి శానిటరీ కాంప్లెక్స్‌లను అందుబాటులోకి తీసుకొస్తాం. తొందరలోనే పనులు చేపట్టి ఇబ్బందులు తొలగిస్తాం.
– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

జన్మనిచ్చిన గడ్డకు ఎంత సేవ చేసినా తక్కువే

- టీఎస్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్
- ప్రభుత్వ పాఠశాలకు నోట్‌బుక్స్ అందజేత



విలాసాగర్‌లో మాట్లాడుతున్న టీఎస్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

వేములవాడ: జన్మనిచ్చిన గడ్డకు ఎంత సేవ చేసిన తక్కువేనని టీఎస్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. తన స్వస్థలం బోయినపల్లి మండలం విలాసాగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తన అనుభవాలను, చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ హ్యూమన్ వెల్ఫేర్ ప్రిన్సిపుల్స్ మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిక్షనరీలు, స్థానికుల సహకారంతో విద్యార్థులకు 150 ట్రాక్‌సూట్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. తన తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తానన్నారు. గ్లోబల్ మిషన్ చైర్మన్ సుంకపాక చక్రవర్తి, జాయింట్ సెక్రటరీ ముదుగంటి సుజాత, తాజా మాజీ సర్పంచ్ జూపల్లి స్వప్నాంజలి, అంజనీరావు, ప్రధానోపాధ్యాయులు బొలుగం శ్రీనివాస్, పొత్తూరి రాజు, వెంకటయ్య, శంకరయ్య, అధ్యాపకులు మల్లేశం, రాజిరెడ్డి, క్లస్టర్ సీఆర్పీ తిరుపతి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

గంభీరావుపేట: ముస్తాబాద్ మండలకేంద్రంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు మట్ట రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ఉచిత క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లె బాల్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు గజ్జల రాజు, నాయకులు గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లిలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'ప్రైవేట్' నో పార్కింగ్

వేములవాడ: రాజన్న భక్తులు విడిది చేసే భీమేశ్వర సదన్‌లో ఇన్నాళ్లు ప్రైవేట్ వ్యక్తులు తమ వాహనాలను అక్కడి ఖాళీ స్థలంలో నిలుపుకునేవారు. ఇటీవల ఈవో విజిట్ చేసిన సమయంలో భక్తుల వాహనాల కంటే ప్రైవేట్ వాహనాలు ఎక్కువగా ఉండడం గమనించి వాటిని తొలగించాలని సూచించారు. అంతేకాకుండా భక్తుల వాహనాల వివరాలు నమోదు చేయాలని తెలిపారు. దీంతో అధికారులు బుధవారం నుంచి ప్రైవేట్ వాహనాలకు అనుమతించడం లేదు. పార్కింగ్ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించాలి



వీర్నపల్లి: తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్సై వేముల లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సిబ్బందితో కలిసి కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని హాస్టల్ వెనుక మామిడితోట పక్కన గల అడవిలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. హాస్టల్ వెనుక మామిడితోట పక్కన గల అడవిలో మృతదేహం ఉన్నట్లు గొర్లకాపరులు తెలిపారు. ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఉరివేసుకొని మృతిచెందినట్లు ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలు లేకుండా కుళ్లిపోయి ఉండడంతో వైద్యులను పిలిపించి పరీక్షల కోసం నమూనాలు సేకరించారు. చనిపోయి సుమారు నెల రోజులు గడిచి ఉండవచ్చన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే వాహనాలు సీజ్



ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లతో మాట్లాడుతున్న ఎస్సై అంజయ్య

వేములవాడరూరల్: ట్రాక్టర్ డ్రైవర్లు వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే వాహనాలు నడపరాదని ఎస్సై అంజయ్య అన్నారు. వేములవాడ మండలంలోని లింగంపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో ఆయన మాట్లాడుతూ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న సమయంలో అతి వేగంగా వెళ్లరాదన్నారు. తప్పనిసరి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, పాఠశాల ఆవరణలో వేగంగా వెళ్లవద్దన్నారు. ఎవరైనా నిబంధనలకు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఎస్సైని సన్మానిస్తున్న ఆటో యూనియన్ సభ్యులు, మైనార్టీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుని ప్రమాదాలకు గురి చేయొద్దని ఎస్సై రాహుల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌రెడ్డిని గురువారం మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు, మండల మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆటోలు నడుపుతున్న సమయంలో సరైన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. యూనియన్ అధ్యక్షుడు బొమ్మనవేని రవి, అల్లె రాజు, సభ్యులు చింతల దిలీప్, నీరటి శ్రీను, తుమ్మల ధర్మపురి, చేపూరి రాజు, గూడెపు కిషన్, బొండ్ల ఎల్లం, మైనార్టీ నాయకులు షాదుల్లా, సాహెబ్, ఎస్‌కే గౌస్, షాదుల్, హసన్, హైమద్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి


కోనరావుపేట: నిజామాబాద్ గ్రామానికి చెందిన బర్మ బీరయ్య అనే గొర్రెకాపరికి చెందిన గొర్రె విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బీరయ్య తన గొర్రెలను తీసుకుని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ సపోర్ట్ వైర్ తగిలి మృతిచెందింది. సుమారు రూ.10 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటకు చెందిన నాగజ్యోతికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.27,500 చెక్కును కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా అందజేశారు. నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అన్నారు. ఇక్కడ బైరగోని నందూగౌడ్, శ్రీనివాస్, శ్రీనివాసరావు, ఎక్కల్‌దేవి శ్రీనివాస్ తదితరులున్నారు.

వేములవాడ: బోయినపల్లి మండలం తడగొండలో సీఎం రిలీఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కట్ట మల్లయ్యకు రూ.36 వేలు, మొయినుద్దీన్‌కు రూ.15వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఉయ్యాల శ్రీనివాస్, సింగరి కేశవరెడ్డి, మండల శ్రీనివాస్ పంపిణీ చేశారు.



కోనరావుపేట: మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. పాఠశాల ఆవరణలోనే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె నిర్మించలేదు. మైదానం కావడంతో బాలికలు ఇక్కడే క్రీడల్లో పాల్గొంటారు. కాగా ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
– దొబ్బల ప్రకాశ్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
దివ్య, సెస్ ఏఈ, సెల్ నెంబర్. 94408184078

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి



చందుర్తి : కొత్తపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

చందుర్తి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాధ కోరారు. మండలంలోని కొత్తపేట, లింగంపేట, మర్రిగడ్డ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, వన నర్సరీలను, ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి, తొందరగా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా ప్లాంటేషన్‌ను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో ప్రదీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తంగళ్లపల్లి ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవోతోపాటు ఎంపీవో మీర్జా అహ్మద్ అఫ్జల్ బేగ్, ఇందిరమ్మ హౌజింగ్ ఏఈ హమీద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం..

వందశాతం ఇంటి పన్నులు వసూళ్లు సాధించిన దేశాయిపల్లి పంచాయతీ కార్యదర్శి సలీమ్, కారోబార్ హరీశ్‌ను ఎంపీడీవో లక్ష్మీనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కోనరావుపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. మండలకేంద్రంలోని వడ్డెర కాలనీలో గురువారం డ్రైడే, ఫీవర్ సర్వే నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఇంటిని సందర్శించి పూలకుండీలు, పాత టైర్లు, కుండల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. మురుగు కాలువల్లో, ఇండ్ల సమీపంలో దోమలమందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చిరంజీవి, సీహెచ్‌వో కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు సువర్ణ, రషీద్, మోహన్, కార్యదర్శి సాయికృష్ణ, ఏఎన్‌ఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాల తరలింపు

వేములవాడ: బోయినపల్లి మండలం కొదురుపాకలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు గతంలో వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహాలకు భూమిపూజ చేశారు. ఈక్రమంలో రెండు వర్గాలు ఏర్పాటు చేసిన విగ్రహాలను శాంతిభద్రతల దృష్ట్యా స్థానిక పోలీసులు ఆ విగ్రహాలను గ్రామపంచాయతీ కార్యాలయానికి గురువారం రాత్రి తరలించారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు లేకపోవడంతో వాటిని తరలించినట్లు పోలీసు అధికారులు, గ్రామపంచాయితీ అధికారులు తెలిపారు.

బీఎల్‌వోలకు శిక్షణ

గంభీరావుపేట: రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ముస్తాబాద్ మండలంలోని బీఎల్‌వోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షకుడు పాతూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. తహసీల్దార్ సురేశ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం

గంభీరావుపేట: బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దుంపటి ఎల్లెందర్, శీతల మోహన్, బిద్ది నర్సింలు, ఇర్రి గణేశ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తొట్ల మల్లేశ్ యాదవ్, నామాపురం విష్ణు గౌడ్, కార్యదర్శులుగా కావేటి దుర్గేశ్ యాదవ్, దేవరాజు, స్వామి, బూరవేని మహేశ్‌యాదవ్, కోశాధికారిగా గుర్రం నాగరాజుగౌడ్‌తో పాటు 23 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల అర్బన్ : హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో శుక్రవారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు సూర దేవరాజు కోరారు. బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్న సందర్భంగా జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్‌పార్టీ గ్రామస్థాయి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాధ్యతలు స్వీకరణ

వేములవాడఅర్బన్: వేములవాడ కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సాయికుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మేనేజర్ పవన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి రాజన్న చిత్రపటం అందజేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని తంగళ్లపల్లికి చెందిన దూదేకుల బాషుమియాకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డుపై హర్షం

ఇల్లంతకుంట: మండల ఆదర్శ మహిళా సమాఖ్య ఆత్మ నిర్భర్ సంఘతన్ జాతీయస్థాయి అవార్డుకు ఎంపికవడంపై మండల ఐకేపీ ఏపీఎం కట్ట వాణిశ్రీ, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.